క్లుప్తంగా

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



రుచిగా వండిన భోజన నిర్వాహకురాలికి బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ

గడివేముల: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో భోజన నిర్వాహకులకు, హెల్పర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరంగా భోజనం అందించాలన్నారు. వంటలు తయారు చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం భోజన నిర్వాహకులుకు, హెల్పర్లకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని స్థానిక పీహెచ్‌సీ ఆయుష్ డాక్టర్ ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో వైద్య సిబ్బందితో డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అవగాహన ర్యాలీ, టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ దగ్గు, జ్వరం వారం రోజులపాటు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ నిర్ధారణ అయితే డాక్టర్లు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడి నయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ కె.వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు, యువత చదువుతో పాటు భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకోవాలని, అప్పుడే పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగ అవకాశాలు అందుకోగలుగుతారని సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ చెప్పారు. పికాక ఫౌండేషన్, ఐఆర్ఎస్ బి.దస్తగిరి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహిస్తున్న కెరీర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్తా పత్రికలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ వంటివి చదవడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే కరెంట్ అఫైర్స్‌పై పూర్తి పట్టు సాధించవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని, నైతిక విలువలు పాటిస్తూ, పట్టుదలతో కృషి చేసి విజయ శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల సిద్ధం కావాల్సిన మెళకువలు, ఏయే రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయో వివరించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, న్యాయవాది బలరాం పాల్గొన్నారు.

పన్ను రిటర్న్స్ సకాలంలో దాఖలు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీకాంత్

కర్నూలు (అగ్రికల్చర్): ఆదాయ పన్ను చెల్లింపులపై సహకార సంఘాలు, సీఈఓలు పూర్తి అవగాహన పెంచుకోవాలని కర్నూలు ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ ఎస్.శ్రీకాంత్ సూచించారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ మందిరంలో సహకార సంఘాల సీఈఓలు, పర్సన్ ఇన్‌చార్జ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలను వివరించారు. సహకార సంఘాలు సకాలంలో ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడం ప్రాధాన్యతను ప్రత్యేకంగా వివరించారు. కోర్ సెషన్ సహకార సంఘ సభ్యులతో అవగాహన పెంచడంపై ఆయన దృష్టి సారించారు. కర్నూలులోని వార్డు–1లోని ఐటీఓ ఎం.సత్యానంద్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను నియమావళిని సరళీకృతం చేయడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పన్ను చెల్లింపుపై సహకార సంఘాల సీఈఓలు లేవనెత్తిన వివిధ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్ డి.పాండురంగ, జిల్లా సహకార అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడవటమే చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ
- గూడూరులో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పోటెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గూడూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సతీష్, హర్షవర్ధన్‌రెడ్డి, మణిగాంధీ తదితరులు



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



గూడూరు తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న సతీష్, కోట్ల హర్ష, మణిగాంధీ

కోడుమూరు రూరల్: నమ్మిన వారిని వెన్నుపోటు పొడవటమే చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వంపై వెన్నుపోటు దినం పేరుతో బుధవారం గూడూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా గూడూరులో బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు రైతు భరోసా, చదువుకునే పిల్లలకు తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అంటూ 143 అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు.. ఏడాది అవుతున్నా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. కూటమి పాలనను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తోందన్నారు. కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను, దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ధైర్యంగా ఉండాలని, రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, జగనన్న 2.0గా చూస్తారని, కూటమి నాయకులు గుర్తించుకొని మెలగాలని, తమకు ఏమిచ్చారో తిరిగి డబుల్‌గా చెల్లిస్తామన్నారు. అనంతరం వారు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సునీత, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్.అస్లాం, లక్ష్మన్న, కర్నూలు జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు క్రిష్టారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, కర్నూలు వైస్ ఎంపీపీ నెహమియ్యా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు లాయర్ ప్రభాకర్, హనుమంతరెడ్డి, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌బాషా, అధికార ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి, స్టూడెంట్ వింగ్ రాష్ట్ర ప్రతినిధి గౌతమ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రమేష్‌నాయుడు, నాయకులు మోహన్‌బాబు, రామాంజనేయులు, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు వైఎస్సార్‌సీపీ మద్దతు



గూడూరులో సమ్మె చేస్తున్న నగర పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: సమస్యల పరిష్కారంలో భాగంగా రెండు వారాలుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న గూడూరు నగర పంచాయతీ కార్మికులకు బుధవారం వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ దీక్షా శిబిరాన్ని చేరుకుని కార్మికులతో మాట్లాడారు. 15 ఏళ్లపైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయడంతో పాటు, నెలనెలా జీతాలను సక్రమంగా ఇచ్చి తమకు ప్రభుత్వ పథకాలను వర్తింప జేయాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలన్న న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకుండా వేధిస్తోందని పంచాయతీ కార్మికులు మొర పెట్టుకోగా.. కోట్ల హర్ష, సతీష్ మాట్లాడుతూ కార్మికుల సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని, జగనన్న అధికారంలోకొచ్చిన వెంటనే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు అరవింద్, అల్లిబాషా, మధు, దూకేశ్వరరావు, షబ్బీర్, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, ఖాజా, ప్రభాకర్, ఉసేన్ తదితరులున్నారు.

దౌర్జన్యాలను అరికట్టాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు, ప్రజా సంఘాల నాయకులు

పాణ్యం: గ్రీన్‌కో దౌర్జన్యాలను అరికట్టాలని పిన్నాపురం రైతులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పిన్నాపురం సోలార్ పరిశ్రమ వద్ద వారు రాస్తారోకో చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, వెంకటేశ్వరరావులతో పాటు రైతులు మాట్లాడుతూ సోలార్ పరిశ్రమకు భూములిచ్చిన రైతులపై దౌర్జన్యాలు ఆపాలన్నారు. బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని అనేక సార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్, వీరన్న, నరసింహనాయక్, సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు సురేష్, క్రిష్ణ, ప్రసాదు పాల్గొన్నారు.

హరిత హితమే అత్యుత్తమ సేవ



పర్యావరణం గురించి వివరిస్తున్న యాగంటీశ్వరప్ప

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యుత్తమ సేవా మార్గమని పర్యావరణ వేత్త, ఉపాధ్యాయులు యాగంటీశ్వరప్ప అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన పర్యావరణ పరిరక్షణపై మాట పద్యం రూపంలో పిల్లలకు వివరించారు. ప్రతి జీవి జీవించడానికి అవసరమైన ఆహారం, గాలి, నీరు పచ్చని మొక్కల నుంచి లభిస్తున్నాయన్నారు. మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా మనిషతో పాటు సకల జీవులకు సేవ చేసినట్లని చెప్పారు. బాల్యం నుంచే మొక్కలు నాటడం పర్యావరణాన్ని పరిరక్షించడం అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడం పునరుత్పాదక ఇంధన వనరులను వాడటం, ఇంటి పెరటిలోనూ, డాబాలపైనా మొక్కలను పెంచడం ద్వారా ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షకులుగా ఉంటూ దేశ సుస్థిరాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ శిక్షణలో స్వచ్ఛందంగా పాల్గొన్న శిక్షకులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యపై అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏపీఎస్‌పీ క్యాంపులో బైపాస్ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 130 మీటర్ల బైపాస్ రహదారి నిర్మాణం నిర్మించి ఏపీఎస్‌పీ క్యాంపు అంతర్గత రహదారికి అనుసంధానం చేసి హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. దీని వల్ల బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చన్నారు. రూ.85 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకాలతో రక్షణ కల్పించవచ్చని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం నగర శివారులోని బి.తాండ్రపాడు సచివాలయ పరిధిలో వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత, కిల్కారి మెసేజ్ విధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను మాతాశిశు సంరక్షణ కార్డులో సూచించిన తేదీ ప్రకారం క్రమం తప్పక ఇప్పించాలని తల్లులకు సూచించారు. ముఖ్యంగా ఎంఆర్ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్ రుబెల్లా టీకాను పిల్లలకు 9, 16 నెలల వయస్సులో తప్పక వేయించాలన్నారు. కిల్కారి మెసేజ్ విధానంలో గర్భిణులకు 4వ నెల నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్‌లు 01244451660 నంబర్ నుంచి వస్తాయన్నారు. ఏదైనా కారణం వల్ల గర్భిణి/తల్లి ఆ వాయిస్‌ను వినలేకపోతే తర్వాత 14423 నంబర్‌కు కాల్ చేసి వాయిస్ మెసేజ్‌ను వినేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కాల్స్ పూర్తిగా ఉచితమని, మాతాశిశు సంరక్షణ కోసం దీనిని రూపొందించినట్లు తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యోజిత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



గడివేముల నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

ఓర్వకల్లు: కల్లూరులో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు మేరకు నియోజవకర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఓర్వకల్లు మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, పార్టీ నాయకుడు కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వెంకటశివకృష్ణారెడ్డి, తోట కృష్ణారెడ్డి, చెన్నూరు కోటేశ్వరరెడ్డి, సుంకిరెడ్డి, మహేశ్వరరెడ్డి, బషీర్‌మియా, సున్నాబాషా, భాస్కర్‌రెడ్డి, చేట్ల కృపయ్య, కురువ పెద్ద ఎల్లయ్య, బాబు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

- పాణ్యం: వెన్నుపోటు దినం పేరుతో కల్లూరులో బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు రామలక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, చందమామ బాబు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ప్రసాద్, రోషన్న తదితరులు పాల్గొన్నారు.
- గడివేముల: కల్లూరులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మధుసూదనల ఆధ్వర్యంలో మండలం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, పార్టీ నాయకులు శివరామిరెడ్డి, ఎల్లారెడ్డి, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, రఘుమాధవరెడ్డి, పుల్లయ్య, డాలుస్వామి, భూపాల్‌రెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, రమేష్, సుబ్బారెడ్డి, గోపాలయ్య, ఉశేన్‌బాషా, తలారి చిన్నన్న, గని ప్రతాపరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, గోద ప్రసాద్, ఉపసర్పంచ్ బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.
- గూడూరుకు..

కోడుమూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గూడూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి కోడుమూరు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కోడుమూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, మగ్బుల్, జంగాల మద్ది, క్రిష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, వెంకటగిరి వేణుగోపాల్ రెడ్డి, తిమ్మారెడ్డి, వెంకట శివుడు, వర్కూరు రఘురెడ్డి, ధర్మారెడ్డి, దస్తగిరి, ప్యాలకుర్తి రామక్రిష్ణారెడ్డి, బందెనవాజ్, పులకుర్తి సత్యారెడ్డి, ప్రసాద్, ముడుమలగుర్తి సురేంద్రరెడ్డి, శివ, మద్దిలేటి, మద్దయ్యల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గూడూరుకు వాహనాలు, బైక్‌లపై ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

- సి.బెళగల్: గూడూరులో చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహుడు ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈర్లదిన్నె నుంచి నాగేశ్వరరెడ్డి, కొండాపురం నుంచి శంకర్‌రెడ్డి, కె.శింగవరం నుంచి శేషిరెడ్డి, పలుకుదొడ్డి నుంచి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు రాగా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, పులిరాజు, రామకృష్ణ, ఎల్ఎల్‌సీ మాజీ చైర్మన్ చిన్నకొండయ్య, సింగల్‌విండో మాజీ డైరెక్టర్ సీబీ తులసిరెడ్డి, సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్‌లు పాండురంగన్న, దస్తగిరి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాఘవేంద్ర, నాగప్ప, శ్రీనివాసరెడ్డి, తదితరులు గూడూరు వెళ్లిన వారిలో ఉన్నారు.



కోడుమూరు నుంచి గూడూరుకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సి.బెళగల్ నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

భూ కబ్జాపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లిందకొండలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నాగన్న కుటుంబం ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నా హక్కులు కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. నాగన్నకు పట్టా ఇవ్వకపోవడంతో దానిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడిందన్నారు. దీనిపై వెంటనే కలెక్టర్ కలుగజేసుకొని పూర్తి స్థాయి విచారణ చేయించి నాగన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కార్బైడ్ పరిశ్రమను తెరిపించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర శివారులోని దిన్నెదేవరపాడులో ఉన్న కార్బైడ్ (వీబీసీ) పరిశ్రమను తక్షణమే తెరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు చెల్లించాల్సిన రూ.7 కోట్ల పీఎఫ్, ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. 2018లో పరిశ్రమ మూతపడటంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. అయితే యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. నాయకులు లక్ష్మన్న, భాస్కరరెడ్డి, ఆదిశేషన్న పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థల్లో దాదాపు 10 వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయకుండా ఉన్నవారితో చాకిరీ చేయిస్తుండడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు చెప్పారు. పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసన్న, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

నూతనపల్లె రోడ్డు దుస్థితి



నగుబాటు

కర్నూలు మండలం పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని నూతనపల్లె గ్రామానికి సూదిరెడ్డి పల్లె నుంచి వేసిన రెండు కిలో మీటర్ల సీసీ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి నెర్రలిచ్చి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తయారైంది. రాత్రి సమయాల్లో గ్రామానికి రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డుపై గుంతల్లో నీరు చేరి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని నూతన పల్లె గ్రామస్తులు కోరుతున్నారు.

– కర్నూలు(రూరల్)

భారీ వాహనం వెళ్తుండటంతో దుమ్ములేస్తున్న దృశ్యం



దుమ్ముతో అవస్థలు

గడివేముల: మండల కేంద్రంలో భారీ వాహన రాకపోకల సమయంలో ఏర్పడే దుమ్ముతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వాహనాలు గడివేములలో వెళ్తునప్పుడల్లా పెద్ద ఎత్తున దుమ్ములేస్తోంది. ఫ్యాక్టరీ భారీ వాహనాలు వారికి కేటాయించిన రహదారిలో వెళ్లాలని ప్రజలు సూచిస్తున్నా పెడచెవిన పెడుతుండటంతో ఈ దుస్థితి దాపురించింది. దుమ్ము తీవ్రతతో వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.